సాక్షి
అనంతపురం
ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.32,150
అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32,150 పలికాయి. కనిష్టం రూ.10 వేలు, సరాసరి రూ.12 వేల చొప్పున అమ్మకాలు సాగాయి.



టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి ధర రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం పెరిగింది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

మందకొడిగా పంటల బీమా ప్రీమియం చెల్లింపు

- నేటితో ముగియనున్న గడువు



అనంతపురం అగ్రికల్చర్: రబీకి సంబంధించి పంటల బీమా పథకం కింద గుర్తించిన పంటలకు రైతులు తమ వాటా ప్రీమియం చెల్లించడానికి సమయం దగ్గర పడింది. వరికి మినహా మిగతా పంటలకు ఆదివారంతో గడువు ముగియనుంది. వాతావరణ, ఫసల్ బీమా కింద పప్పుశనగ, వేరుశనగ, పప్పుశనగ, జొన్న, మొక్కజొన్న, వరి, టమాట, మామిడి పంటలకు బీమా వర్తింపజేశారు. ఇందులో వ్యవసాయ పంటలకు రైతులు తమ వాటా కింద 1.5 శాతం, అలాగే మామిడి, టమాట వంటి ఉద్యాన పంటలకు 5 శాతం మేర ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. అంటే పప్పుశనగ రైతులు ఎకరాకు 450, వేరుశనగకు రూ.480, జొన్నకు రూ.315, మొక్కజొన్నకు రూ.525, వరికి రూ.630, టమాటకు రూ.1,600, మామిడికి రూ.1,650 ప్రకారం ప్రీమియం చెల్లించాలి. ఇందులో వరికి ప్రీమియం చెల్లింపు గడువు నెలాఖరు వరకు ఉంది. మిగతా అన్ని పంటలకు ఈ నెల 15వ తేదీ (ఆదివారం)తో గడువు ముగియనుంది. అయితే ఇప్పటికీ 40 శాతం మంది కూడా ప్రీమియం చెల్లించలేదని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని పంటలకూ ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించాలని ప్రభుత్వానికి, ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు.

క్రమశిక్షణతో మెలగాలి

- ఘర్షణలో పాల్గొన్న 8 మంది విద్యార్థులు హాస్టల్ నుంచి సస్పెన్షన్
- హాస్టల్‌ను సందర్శించిన ఇన్‌చార్జ్ వీసీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత

అనంతపురం: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత సూచించారు. ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడు, నాలుగో సంవత్సరం చదువుతూ తుంగభద్ర హాస్టల్‌లో ఉన్న విద్యార్థుల మధ్య గురువారం రాత్రి ఘర్షణ జరిగింది. శనివారం ఉదయం హాస్టల్‌ను సందర్శించిన ఇన్‌చార్జ్ వీసీ ఇంజినీరింగ్ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఘర్షణకు పాల్పడిన ఎనిమిది మంది విద్యార్థులను తల్లిదండ్రుల సమక్షంలోనే మందలించారు. కష్టపడి చదివిస్తుంటే మీరు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తారా అంటూ మండిపడ్డారు. క్రమశిక్షణతో మెలగకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఇన్‌చార్జ్ వీసీ భోజనం చేశారు. మరోవైపు ఇటుకలపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ సైతం 8 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సదరు విద్యార్థులను హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారు. అలాగే ఘటనకు సంబంధించి ఉన్నతాధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించిన వాచ్‌మెన్‌లు ఉజ్జినయ్య, నాగరాజు, మెయిన్ గేట్ వద్ద ఉన్న రామ్మోహన్ రెడ్డి, సూర్యనారాయణ, బాలరాజుకు మెమో జారీ చేశారు. ఇన్‌చార్జ్ వీసీ వెంట ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర పాల్గొన్నారు.

నాడి పట్టరు.. జాలి చూపరు

అనంతపురం పాతూరుకు చెందిన ఓ పేషెంటు స్థానిక ధర్మవరం బస్టాండ్ సమీపంలోని సూర్యానగర్‌లో ఉన్న ఓ ఎండోక్రినాలజిస్ట్ దగ్గరకు వెళ్లాడు. అక్కడే ఉన్న ల్యాబ్‌లో బ్లడ్ టెస్ట్ చేయించుకుంటేనే డాక్టర్ అపాయింట్‌మెంట్ ఇస్తారనడంతో తెల్లవారుజామున నాలుగు గంటలకే అక్కడికి చేరుకున్నాడు. ఏనాడూ స్టెతస్కోప్ వాడని సదరు డాక్టర్..పేషెంటు రిపోర్టులు చూసి మందులు రాశారు. ఏడాది తర్వాత హైదరాబాద్‌లో చూపించుకుంటే మందులే అవసరం లేదని, ఇంకా ప్రీడయాబెటిక్ స్టేజ్‌లోనే ఉన్నావని చెప్పడంతో నిర్ఘాంతపోవడం పేషెంటు వంతైంది.

అనంతపురం సాయినగర్ నుంచి విద్యుత్ నగర్ సర్కిల్‌కు వెళ్లే దారిలో రోడ్డుకు ఎడమవైపున ఇద్దరు డాక్టర్లు (భార్యాభర్త) ఆస్పత్రి నడిపిస్తున్నారు. ఇందులో భర్త స్కిన్ స్పెషలిస్టు. ఆయన దగ్గరకు వెళితే ఫీజు సెపరేటు.. తర్వాత సబ్బులు, క్రీములు, మందులు అంటూ రూ.2 వేలు తక్కువ కాకుండా రాస్తారని స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన ఓ పేషెంటు గగ్గోలు పెట్టారు.

అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రోడ్డులోని న్యూరో డాక్టరు వద్దకు తలనొప్పిగా ఉందని వెళితే ఏకంగా ఎంఆర్‌ఐ స్కానింగ్ రాశారని లక్ష్మీనగర్‌కు చెందిన పేషెంటు ఆవేదన చెందారు. కనీసం నాడి కూడా చూడకుండానే తలనొప్పి అనగానే ఎంఆర్‌ఐ అన్నారని వాపోయారు.

- వైద్యుడి చేతిలో కన్పించని స్టెతస్కోప్
- రోగ లక్షణాలు చెప్పకముందే మూరెడు పొడవున టెస్టుల జాబితా
- తలనొప్పి అనగానే ప్రిస్క్రిప్షన్‌లో ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్
- ప్రైవేటు ల్యాబులతో కుమ్మక్కై వేలకు వేలు పిండుతున్న కొందరు డాక్టర్లు
- సిజేరియన్ కాన్పులకు వెళుతున్న వారికి గరిష్టంగా రూ.లక్ష ఖర్చు
- పరాకాష్టకు ఎండోక్రినాలజీ డాక్టర్ల దోపిడీ



ఉమ్మడి అనంతపురం జిల్లాలో...	
ప్రైవేటు ఆస్పత్రులు: 169	దయాగ్నస్టిక్ సెంటర్లు: 83
పాలీక్లినిక్‌లు: 06	అల్లోపతి వైద్యులు: 2,000 వరకు
ఔట్‌పేషెంట్లు (రోజుకు): 15,000- 17,000	
ఇన్‌పేషెంట్లు (రోజుకు): 2,500- 3,000	
టెస్టులు రాస్తున్నది: 10,000 వరకు	

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో కొందరు ప్రైవేటు వైద్యుల దోపిడీ పరాకాష్టకు చేరింది. చిన్న చిన్న సమస్యలతో వెళ్లినా పెద్దమొత్తంలో బిల్లు చేసి రోగుల గుండె గుబేల్‌మన్పిస్తున్నారు. మధుమేహ బాధితులు రక్తంలో గ్లూకోజు స్థాయిని తగ్గించుకునేందుకు ఎండోక్రినాలజిస్ట్ దగ్గరకు వెళితే కనీసం చూడకుండానే రక్తాన్ని పిండుకుంటున్నారు. చర్మం మీద మచ్చలొచ్చాయని వెళ్లిన వారికి స్కిన్ స్పెషలిస్టులు చర్మం వలిచేస్తున్నారు. పురిటినొప్పులతో నర్సింగ్ హోంలకు వెళితే కళ్లు బైర్లు కమ్మేలా బిల్లులు వేస్తున్నారు. సిజేరియన్‌కు ఏకంగా లక్ష రూపాయలు బిల్లు వేస్తున్న పరిస్థితి. జిల్లా కేంద్రంలోని కొందరు స్పెషలిస్టు డాక్టర్లయితే రోజురోజుకూ ఫీజులు పెంచేస్తున్నారు. ఏ డాక్టరు వద్దకు వెళ్లినా ఏమున్నది గర్వకారణం..సర్వం డబ్బుమయం అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇక సవేరా వంటి కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులకు సామాన్య రోగులు వెళ్లే పరిస్థితే లేదు. పేషెంటు బెడ్డు ఎక్కకమునుపే లక్షలకు లక్షలు అడ్వాన్సులు కట్టించుకుంటున్నారు.

నాడిపట్టే దిక్కు లేదాయె..

అనంతపురం నగరంలోనే కాదు.. వివిధ నియోజకవర్గ కేంద్రాల్లోనూ 98 శాతం మంది డాక్టర్లు స్టెతస్కోప్ పట్టడం లేదు. పల్స్, గుండె లయ చూడటం ఎప్పుడో వదిలేశారు. ఐదు నిమిషాల్లోపే రోగ లక్షణాలడిగి మూరెడు పొడవున టెస్టులు రాస్తున్నారు. వాటికే రూ.6 వేల నుంచి రూ.10 వేలవుతోంది. తలనొప్పి, వెన్నునొప్పి వంటి సమస్యలతో వెళితే వందశాతం ఎంఆర్‌ఐ రాస్తున్నారు. గోటితో పోయేది గొడ్డలిదాకా అన్నట్టుగా అనవసర వైద్య పరీక్షలతో రోగిని గుల్ల చేస్తున్నారు. ల్యాబుల నుంచి వచ్చే కమీషన్ల కోసం డాక్టర్లు కక్కుర్తి పడుతున్నట్టు విమర్శలు ఉన్నాయి.

నియంత్రణ ఏదీ?

ప్రైవేటు వైద్యుల దోపిడీకి నియంత్రణే లేదు. పర్యవేక్షణ, నియంత్రణ చేయాల్సిన వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు లంచాలు తీసుకుని చూసీచూడనట్టు వెళుతున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో డాక్టర్ల నిర్లక్ష్యంతో బాలింతలు, పసికందులు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఈ విషయంలో వైద్య శాఖ ఉన్నతాధికారి సొమ్ములు కూడబెట్టుకున్నారు గానీ.. బాధితులకు ఏమాత్రమూ న్యాయం చేయలేకపోయారన్న విమర్శలు ఉన్నాయి. అలాగే ఆర్‌ఎంపీలను ఏజెంట్లుగా పెట్టుకుని ప్రైవేటు ఆస్పత్రులు సాగిస్తున్న అరాచకాలతో రోజూ వేలాదిమంది రోగులు నిలువు దోపిడీకి గురవుతున్నారు.

షాపులు నడిపితే చంపేస్తామంటున్నారు

- ఎమ్మెల్యే పరిటాల సునీత, అనుచరులు బెదిరిస్తున్నారు
- మద్యం షాపుల లైసెన్స్‌దారుల ఆవేదన

పంజగుట్ట (హైదరాబాద్): అనంతపురం జిల్లాలో మంజూరైన మద్యం షాపులు నడిపించుకోకుండా టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత, అనుచరులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు కృష్ణా జిల్లా నందిగామకు చెందిన మేడ గోపి, కె.గురునాథం శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మద్యం టెండర్లలో తాము మొత్తం 25 షాపులకు టెండర్ వేశామన్నారు. గోపికి అనంతపురంలో రెండు షాపులు (ఏటీ-100, ఏటీ-97), రాప్తాడులో ఒకటి (ఎస్‌ఎస్-22), గురునాథంకు అనంతపురంలో ఒకటి (ఏటీ-89), తాడిపత్రిలో ఒక షాపు (ఏటీ-93) దక్కాయన్నారు. ఒక్కో షాపునకు రూ.20 లక్షల చొప్పున ఎక్సైజ్ డ్యూటీ చెల్లించామన్నారు. షాపు రూములను కూడా అద్దెకు తీసుకున్నామన్నారు. కానీ ఎమ్మెల్యే పరిటాల సునీత అనుచరులు గుంపుగా వచ్చి తమను తీసుకెళ్లి తీవ్ర భయభ్రాంతులకు గురిచేశారని, షాపులు నడిపితే చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఎక్కడైనా టెండర్లు వేసుకోవచ్చునంటూ పేర్కొని తీరా షాపులు మంజూరయ్యాక బెదిరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పెట్టుబడి పెట్టి రెండు నెలలుగా షాపులు నడిపించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, హోంమంత్రి వంగలపూడి అనితతో పాటు జిల్లా కలెక్టర్‌కూ లేఖలు రాశామని, అయినా ఎలాంటి స్పందనా లేదని తెలిపారు. కేవలం రెండు లక్షల రూపాయలు ఇస్తాము.. తప్పుకోండని అంటున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తగిన భద్రత కల్పించి.. తాము షాపులు నడిపించుకునే అవకాశం కల్పించాలని కోరారు.

లోక్ అదాలత్‌లో ఇరువురూ విజేతలే



కేసు పూర్తయిన వారికి పత్రాలు అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్

అనంతపురం: సాధారణంగా ఏ కేసులోనైనా ఒక వైపు మాత్రమే విజయం వరిస్తుందని, అదే లోక్ అదాలత్‌లో ఇరు వైపులా (ఉభయులూ) విజేతలేనని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి (జిల్లా జడ్జి) జి.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కోర్టులో శనివారం లోక్ అదాలత్‌ను జిల్లా జడ్జి ప్రారంభించారు. ఎస్పీ పి.జగదీష్, జిల్లా న్యాయశాఖాధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

6,235 కేసుల పరిష్కారం..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 6,235 కేసులు పరిష్కారమయ్యాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మొత్తం 25 బెంచ్‌ల ద్వారా కేసులు విచారించారు. ఈ సందర్భంగా 5,753 క్రిమినల్ కేసులు, 151 సివిల్ కేసులు, 66 మోటారు వాహన ప్రమాదభరిత కేసులు, 271 ప్రీలిటిగేషన్ కేసులకు పరిష్కారం దక్కింది. ప్రమాదభరిత కేసుల కక్షిదారులకు రూ.5.67 కోట్ల పరిహారం చెల్లింపునకు రాజీ కుదిర్చారు. సివిల్ కేసుల్లో రూ.31,96,134, ప్రీలిటిగేషన్ కేసుల్లో రూ.1.21 కోట్ల పరిహారాన్ని కక్షిదారులకు న్యాయమూర్తులు ఇప్పించారు.

సైబర్ వలలో మున్సిపల్ కార్మికుడు

- రూ.60 వేలు పోగొట్టుకున్న వైనం

రాయదుర్గంటౌన్: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని ఓ మున్సిపల్ కార్మికుడు రూ.60 వేలు పోగొట్టుకున్నాడు. రాయదుర్గం పురపాలకసంఘంలోని ఇంజినీరింగ్ వాటర్ వర్క్స్ విభాగంలో సురేష్ పనిచేస్తున్నాడు. ఇతడికి వినోద్ రాజ్ అనే అపరిచిత వ్యక్తి 99894 73081 నంబర్ నుంచి కాల్ వచ్చింది. 'నీకు రూ.2.50 లక్షల లాటరీ తగిలింది. నీవు నాకు రూ.60 వేలు చెల్లిస్తే లాటరీ డబ్బు నీ అకౌంట్‌కు పంపుతాం' అని అపరిచిత వ్యక్తి చెప్పాడు. నిజమని నమ్మిన సురేష్ విడతలవారీగా శుక్ర, శనివారాల్లో రూ.60 వేల నగదును గూగుల్ పే ద్వారా అపరిచిత వ్యక్తికి పంపాడు. ఆ తరువాత నుంచి అతడి ఫోన్ స్విచాఫ్ రావడంతో తాను మోసపోయానని గ్రహించిన సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



మున్సిపల్ కార్మికుడు సురేష్

మీడియా స్వేచ్ఛపై దాడి సహించం

- వేములలో సాక్షి జర్నలిస్టులపై దాడికి నిరసన
- సంఘీభావం తెలిపిన జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- జర్నలిస్టు, ప్రజా సంఘాల ప్రతినిధుల మద్దతు



సాక్షి మీడియా ప్రతినిధులపై దాడికి నిరసనగా అనంతపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న జర్నలిస్టులు, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

అనంతపురం/అనంతపురం సిటీ: మీడియా స్వేచ్ఛపై దాడిని సహించబోమని జర్నలిస్టులు హెచ్చరించారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం వేములలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ న్యూస్ కవరేజీకి వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాస్, కెమెరామెన్ రాము, సాక్షి దినపత్రిక విలేకరి గొందిపల్లి రాజారెడ్డిపై జరిగిన టీడీపీ నేతల దౌర్జన్యకాండపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనాగ్రహం పెల్లుబుకింది. అనంతపురంలో శనివారం ఉదయం జర్నలిస్టులు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడే ఆందోళన చేపట్టారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ జర్నలిస్టులకు సంఘీభావం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, ఇతర సంఘాల నేతలూ మద్దతుగా ఆందోళనలో భాగస్వాములయ్యారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలంటూ నినదించారు.

తప్పులు కప్పిపుచ్చుకోవడానికే దాడులు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జర్నలిస్టులకు రక్షణ లేకుండాపోయిందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. వేములలో సాక్షి జర్నలిస్టుల బృందంపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. కూటమి పాలన దాడులు, దౌర్జన్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సర్కారు తప్పులను మీడియా పసిగట్టి ఎప్పటికప్పుడు ప్రజలకు చూపించే పాత్ర పోషిస్తుంటే.. ప్రజలను డైవర్షన్‌లోకి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా జర్నలిస్టులపై దాడులకు దిగడం దుర్మార్గ, అరాచక పాలనకు నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులకు రక్షణ కరువైంది..

రాష్ట్రంలో జర్నలిస్టులకు రక్షణ కరువైందని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీడబ్ల్యూజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వేముల ఘటన మీడియా స్వేచ్ఛపై జరిగిన దాడిగా తాము భావిస్తున్నామన్నారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వ పెద్దలకు మీడియా పట్ల ఏమైనా ప్రేమ ఉందా అని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో పోస్టు పెడితేనే వాళ్లను పట్టుకొని అన్ని పోలీస్ స్టేషన్లు తిప్పుతూ కేసులు పెడుతున్న ప్రభుత్వ పెద్దలు.. వేములలో సాక్షి జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై పీడీ యాక్ట్‌లు పెట్టాలని డిమాండ్ చేశారు.

- సాక్షి జర్నలిస్టుల బృందంపై దాడిని ఏపీడబ్ల్యూజే(ఎఫ్) జిల్లా ప్రతినిధి రేపటి రామాంజనేయులు ఖండించారు. మీడియా మీద దాడులు చేసుకుంటూ పోతే మా కెమెరాలన్నీ మీవైపు తిప్పితే ఏమవుతారో ఆలోచించాలని సూచించారు.
- ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ మాట్లాడుతూ వేముల ఘటనను తీవ్రంగా ఖండించారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.
- జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు వృత్తిరీత్యా బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, ఎడిషన్ ఇన్‌చార్జ్ మహేశ్వర రెడ్డి, సాక్షి టీవీ కరస్పాండెంట్ శివారెడ్డి, ఎన్‌టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఏపీజేడీఎస్ జిల్లా కార్యదర్శి విజయరాజు, సాక్షి జర్నలిస్టులతో సహా వివిధ పత్రికల ప్రతినిధులు, సబ్ ఎడిటర్లు, ఎలక్ట్రానిక్, యూట్యూబ్ చానళ్ల విలేకరులు, ఫొటో, వీడియో గ్రాఫర్లు, పత్రికల అనుబంధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

'సాగునీటి' ఎన్నికల్లో 'అధికార' పెత్తనం

- జిల్లాలో ఏకపక్షంగా ఎన్నికలు
- ఇతరులెవరూ పోటీ చేయకుండా టీడీపీ నేతల అడ్డగింత
- సహకరించిన అధికారులు, పోలీసులు



నామినేషన్లు వేయనీయలేదని శింగనమల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి నూర్‌మహమ్మద్



యల్లనూరు పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, అనుచరులు

అనంతపురం సెంట్రల్/శింగనమల/యల్లనూరు: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ఏకపక్షంగా సాగాయి. అధికార టీడీపీ నేతలు పెత్తనం చెలాయించారు. అన్ని స్థానాల్లో తామే గెలవాలన్న ఉద్దేశంతో అప్రజాస్వామిక విధానాలకు తెర తీశారు. ఇతరులెవరూ ఎన్నికల్లో పోటీపడకుండా దౌర్జన్యాలకు దిగారు. అధికారులు, పోలీసులు కూడా వారికి సహకరించారు. నామినేషన్ సైతం వేయకుండా అడ్డగించి.. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మంటగలిపారు. టీడీపీ నేతలు, అధికారుల తీరుకు నిరసనగా చాలాచోట్ల ఎన్నికలను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు బహిష్కరించారు. తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ప్రాజెక్ట్ కింద అనంతపురం, కర్నూలు జిల్లాల్లో మొత్తం 54 నీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. 648 మంది సభ్యులను ఎన్నుకున్నారు. అలాగే చిన్ననీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో 89 నీటి సంఘాలకు ఎన్నికలు జరగ్గా.. రెండు వాయిదా పడ్డాయి. బెళుగుప్ప మండలం శీర్పి, కూడేరు మండలం రామచంద్రాపురం (పొట్టి చెరువు) నీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు. భైరవానితిప్ప ప్రాజెక్ట్ (బీటీపీ) కమిటీ ఎన్నిక కూడా పూర్తయిందన్నారు. త్వరలోనే జిల్లా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తామన్నారు.

శింగనమలలో టీడీపీ దౌర్జన్యం..

శింగనమల రంగరాయల చెరువు సాగు నీటి సంఘం ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. ఇండిపెండెంట్ అభ్యర్థులను నామినేషన్ వేయకుండా, ఓటు కోసం వచ్చిన రైతులను బలవంతంగా బయటకు పంపించారు. ఆరు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఇక్కడ 500 దాకా ఓటర్లు ఉన్నారు. అందులో దాదాపు 200 మంది పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. వీరిలో ఎక్కువమంది ఇండిపెండెంట్ అభ్యర్థి అయిన సాగునీటి పారుదల సంఘం మాజీ అధ్యక్షుడు నూర్ మహమ్మద్‌కు మద్దతుగా ఉన్నారు. అతనితో పాటు అతని అనుచరులు నామినేషన్లు వేయడానికి సిద్ధమవగా.. రైతుల మద్దతు లేని టీడీపీ నాయకులు లోనికి చొచ్చుకొచ్చారు. ఇండిపెండెంట్ అభ్యర్థుల నామినేషన్లు తీసుకోరాదంటూ పోలింగ్ అధికారులతో గొడవ పెట్టుకున్నారు. 'మా ప్రభుత్వం అధికారంలో ఉంది, మేము చెప్పిన వారే ఎన్నికవుతారు. ఓట్లు ఏమీ లేవు. రైతులందరూ బయటకు పోవాలి' అంటూ రైతులను బయటకు పంపించేశారు. గంట తరువాత అధికార పార్టీ నాయకులు నామినేషన్లు వేసుకొని ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ప్రకటించుకున్నారు. ఈ విషయమై తహసీల్దార్ బ్రహ్మయ్య, సీఐ కౌలుట్లయ్యకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా అధికార పార్టీ వారికే సహకరించారని నీటిపారుదల సంఘం మాజీ అధ్యక్షుడు నూర్‌మహమ్మద్ ఆరోపించారు. న్యాయబద్ధంగా ఎన్నికలు తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కోర్టుకు పోతామని చెప్పారు.

పోలీసుల 'పచ్చ'పాతం..

పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) సాగు నీటి సంఘం ఎన్నికల్లో పోలీసులు 'పచ్చ' పాతం చూపారు. నామినేషన్ వేసేందుకు అనుచరులతో వస్తున్న యల్లనూరు జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డిని స్త్రీ శక్తిభవనం వద్దనున్న పుట్లూరు సీఐ సత్యబాబు, యల్లనూరు ఏఎస్‌ఐలు శ్రీనివాసులగౌడ్, సంపత్‌కుమార్, పోలీసుసిబ్బంది అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. సమయమంతా అక్కడే గడిచిపోయింది. దీంతో నామినేషన్ వేయకుండా వెనక్కు వెళ్లారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం



రైలు పట్టాలపై వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని గార్లదిన్నె - కల్లూరు మార్గమధ్యంలో రైలు ఢీకొని శనివారం మధ్యాహ్నం ఓ వృద్ధురాలు (75) మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఊరు, పేరు తెలియని వృద్ధురాలి కాళ్లు, చేతులకు బలమైన గాయాలైనట్లు పేర్కొన్నారు. మృతురాలి ఒంటిపై బ్లూకలర్ చీర మాత్రమే ఉందన్నారు. తమకు సమాచారం అందిన వెంటనే సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం తరలించామని చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు సెల్: 94414 45354కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

హోరాహోరీగా షూటింగ్ బాల్ పోటీలు



షూటింగ్‌బాల్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ఆత్మకూరు: రాష్ట్రస్థాయి 7వ ఆంధ్రప్రదేశ్ ఉమెన్ షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు శనివారం మండలంలోని తలుపూరు గ్రామ ఉన్నత పాఠశాలలో హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 11 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చిన్న గ్రామాల్లోనూ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాముడు తెలియజేశారు. 11 జట్లకు పోటీలు నిర్వహించగా శ్రీసత్యసాయి, కృష్ణ, అన్నమయ్య, నెల్లూరు జిల్లాలు సెమీస్‌కు చేరుకున్నాయన్నారు. ఆదివారం సెమీస్, ఫైనల్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు జనవరి 2వ తేదీన పూరిలోని జగన్నాథ స్టేడియంలో జరిగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

దాతలూ... దయ చూపండి

వైద్య ఆరోగ్య శాఖలో ఆయనో చిరుద్యోగి. తనకన్నా ఉన్నత స్థానంలో కుమారుడిని చూడాలనుకున్నాడు. వచ్చే జీతంలో కొంత మొత్తాన్ని పొదుపు చేసి కుమారుడిని వైద్య కళాశాలలో చేర్పించాడు. ఇక మరికొన్ని నెలల్లో తన కోరిక నెరవేరబోతోందని ఎంతో ఆశపడ్డాడు. అయితే విధి ఆడిన వింత నాటకంలో కుమారుడు కాస్త ప్రమాదం బారినపడి ఆస్పత్రి పాలై మృత్యువుతో పోరాడుతున్నాడు. మామూలు మనిషిని చేయాలంటే రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో ఒక్కసారిగా ఆ తండ్రి కుదేలయ్యాడు. తన కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని దాతలను అర్థిస్తున్నాడు. ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు.

- మృత్యువుతో పోరాడుతున్న వైద్య విద్యార్థి
- శస్త్రచికిత్సకు రూ.10 లక్షలవుతుందన్న వైద్యులు
- దాతల సాయం కోసం ఎదురు చూపు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

సాయం చేయదలిస్తే..

పేరు : ఉదమాల నారాయణస్వామి
బ్యాంక్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిపత్రి బజార్ బ్రాంచ్
ఖాతా నంబర్ : 1109 307 5181
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ : SBIN0004189
ఫోన్‌పే నంబర్ @ 93912 14490



గోపీకృష్ణ (ఫైల్)



గాయాలతో గోపీకృష్ణ



సాయం చేయాలని వేడుకుంటున్న నారాయణస్వామి

యాడికి: తాడిపత్రిలో నివాసముంటున్న నారాయణస్వామి యాడికి మండలం రాయలచెరువులోని పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు ఎలాంటి స్థిరాస్తులు లేవు. కేవలం జీతంపైనే ఆధారపడి కుమార్తెను, కుమారుడిని చదివించుకుంటూ వచ్చారు. కుమారుడు గోపీకృష్ణ తనకంటే ఉన్నత స్థానంలో ఉండాలని కలలు కన్న ఆయన ఆ కలను సాకారం చేసుకునేందుకు అహర్నిశలు శ్రమించారు. తండ్రి ఆశలను వమ్ము చేయకుండా గోపీకృష్ణ సైతం పట్టుదలతో చదువుకుని నీట్‌లో ర్యాంక్ సాధించాడు. ప్రస్తుతం కర్నూలు జిల్లా గూడూరు మండలం పెంచికలపాడులోని విశ్వభారతి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ఆఖరి సంవత్సరం అభ్యసిస్తున్నాడు. కుమారుడి చదువులు, కుమార్తె పెళ్లి కోసం నారాయణస్వామి అప్పులు చేశాడు.

క్షణాల్లోనే జరిగిపోయింది..

విశ్వభారతి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనెల 9వ తేదీ రాత్రి కళాశాల హాస్టల్‌లో భోజనం చేసి తన స్నేహితుడు వైఎస్సార్ జిల్లాకు చెందిన సాయిమణితో కె.నాగలాపురం వద్ద ఉన్న రూముకు ద్విచక్ర వాహనంపై గోపీకృష్ణ బయలుదేరాడు. పెంచికలపాడు పత్తి మిల్లు వద్దకు చేరుకోగానే ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే కర్నూలులోని సర్వజనాస్పత్రికి తరలించారు. విద్యార్థులు అపస్మారక స్థితిలో ఉండడంతో ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలియరాలేదు.

ముఖం ఛిద్రమై..

ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చొని ప్రయాణిస్తున్న గోపీకృష్ణకు ప్రమాదంలో ముఖంపై ఉన్న ఎముకలన్నీ విరిగిపోయాయి. కొన్ని నుజ్జునుజ్జయ్యాయి. సమాచారం అందుకున్న నారాయణస్వామి ఆగమేఘాలపై కర్నూలులోని సర్వజనాస్పత్రికి చేరుకున్నాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న గోపీకృష్ణను చూడగానే ఆయన దుఃఖం కట్టలు తెంచుకుంది. కుమారుడిని ఎలాగైనా బతికించుకోవాలనుకున్న ఆయన వెంటనే స్థానిక ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు... గోపీకృష్ణను మామూలు మనిషిని చేయాలంటే శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. ప్రస్తుతం ఐసీయూలో అందజేస్తున్న చికిత్సకు రోజుకు రూ.30 వేల ఖర్చు వస్తోంది. అప్పు చేసి తనతో పాటు తీసుకెళ్లిన రూ.3 లక్షలను ఆస్పత్రి నిర్వాహకులకు నారాయణస్వామి చెల్లించాడు. శస్త్రచికిత్స అనంతరం మరో నెల రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉండాల్సి వస్తుందని వైద్యులు తెలిపారు. ఇందుకు రూ.10 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని తెలిపారు. అంత పెద్ద మొత్తంలో డబ్బు సమకూర్చడం తలకు మించిన భారం కావడంతో దాతల ఆర్థిక సాయాన్ని అర్థిస్తున్నాడు. ప్రభుత్వం, దాతలు మానవతా దృక్పథంతో ఆదుకుని తన కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని కోరుతున్నాడు.

హిందీ పండిట్ ఆత్మహత్య



మృతుడు పురంధర దాసు

రాయదుర్గంటౌన్: మండల పరిధిలోని టి.వీరాపురం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న పురంధర దాసు(46) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాలమేరకు... డీ.హీరేహాళ్ మండలం పూలకుర్తి గ్రామానికి చెందిన పురంధర రాయదుర్గం పట్టణంలోని గ్యాస్ గోడౌన్ ఏరియాలో నివాసం ఉంటున్నాడు. భార్య సుజాత మండలంలోని పల్లేపల్లి గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే తాగుడుకు బానిసైన పురంధర విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి పాఠశాలకు వెళ్లకుండా గైర్హాజరవుతున్నాడు. అయితే రాయదుర్గం పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న ఓ చింత తోపులో చెట్టుకు ఉరివేసుకుని పురంధర ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో గమనించి స్థానికులు పోలీసులకు సమచారం అందజేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



మృతురాలు సువర్ణమ్మ

రాయదుర్గంటౌన్: ఉరివేసుకుని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని టి.వీరాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాలమేరకు... టి. వీరాపురానికి చెందిన సువర్ణమ్మ (38) భర్త శ్రీరాములు ఆరేళ్ల క్రితమే చనిపోయాడు. సువర్ణమ్మ గ్రామంలోనే ఓ కిరాణ చిల్లరకొట్టును నడుపుతూ జీవనం సాగిస్తోంది. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. శుక్రవారం సాయంత్రం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆమెను కించపరిచే విధంగా మాట్లాడారు. మనస్తాపానికి గురైన సువర్ణమ్మ ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందింది. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి ఈ ఘటనపై బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామ సమీపంలో నల్లలమ్మ దేవాలయం వెనక కల్లందొడ్డిలో ఈ ఏడాది ఏప్రిల్ 10న జరిగిన హత్య కేసును పోలీసులు శనివారం ఛేదించారు. రాప్తాడు సీఐ టీవీ.శ్రీహర్ష వివరాల మేరకు.. బుక్కచెర్లకు చెందిన జలగాని నల్లపరెడ్డి అల్లుడు బుక్కచెర్ల పురుషోత్తంరెడ్డి వ్యభిచారానికి, మద్యానికి బానిసై హెచ్‌ఐవీ వ్యాధితో బాధపడుతూ ఉండేవాడు. ఊళ్లో కూడా ఇష్టానుసారంగా తిరుగుతూ అందరితో అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. హెచ్‌ఐవీ ఉన్నా ఇంట్లో వాడే అన్ని వస్తువులను వాడుతూ కుటుంబ సభ్యులను కూడా ఇబ్బంది పెట్టేవాడు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 10వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో అనారోగ్యంతో బాధపడుతున్న నల్లపరెడ్డి చెల్లెలు అయిన కవితతో పురుషోత్తంరెడ్డి గొడవపడి తీవ్రంగా కొట్టాడు. దీంతో పురుషోత్తంరెడ్డిని ఎలాగైనా చంపాలని మేనమామ నల్లపరెడ్డి పథకం రచించాడు. అదే రోజు సాయంత్రం తమ కల్లందొడ్డి వైపు పురుషోత్తంరెడ్డి వెళ్లగా.. అతని వెంటే నల్లపరెడ్డి కల్లం దొడ్డి దగ్గరకు వెళ్లి ఎందుకు రోజూ ఇంట్లో గొడవ పడుతున్నావని ప్రశ్నించాడు. దీంతో పురుషోత్తంరెడ్డి నల్లపరెడ్డి మీదకు వెళ్లాడు. వెంటనే నల్లపరెడ్డి కుడిచెత్తో పురుషోత్తంరెడ్డి చెంపపై బలంగా కొట్టాడు. పురుషోత్తంరెడ్డి పశువుల పాక కోసం నాటిన ఇనుప పైపునకు కొట్టుకుని కింద పడిపోయాడు. పురుషోత్తంరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న నల్లపరెడ్డి వెంటనే పశువుల పాకలోని చీరను మేడకు బిగించి ఉరి వేసుకుని మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మొదట అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. నిందితుడైన మేనమామ జలగాని నల్లపరెడ్డిని సీఐ టీవీ శ్రీహర్ష తమదైన శైలిలో విచారించగా నిందితుడు తానే చంపానని ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ జగదీష్, డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు.

హక్కుల ఉల్లంఘనపై ప్రశ్నిద్దాం

- మానవ హక్కుల వేదిక రాష్ట్రసభల్లో వక్తలు



ప్రారంభ సభలో మాట్లాడుతున్న గేయానంద్

అనంతపురం కల్చరల్: ప్రతి చోటా సాగుతున్న హక్కుల ఉల్లంఘన లేకుండా ఆధిపత్యాన్ని ప్రశ్నిద్దామని వక్తలు సూచించారు. హెచ్‌ఆర్‌ఎఫ్ (మానవ హక్కుల వేదిక) 10వ రాష్ట్ర మహాసభలు శనివారం స్థానిక ఆపిల్ ఫంక్షన్ హాలులో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అంతర్గత సమావేశాలు, వివిధ జిల్లాల కమిటీల ఎంపిక జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 144 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభల ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, తెలంగాణ హెచ్‌ఆర్‌సీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భుజంగరావు, డాక్టర్ తిరుపతి, ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రాజేష్, కర్ణాటక ప్రతినిధి శ్రీధర్ తొలి సందేశం ఇచ్చారు. పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్, ఏపీ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు చేయాలని, ప్రార్థనా స్థలాల చట్టం 1991ను అమలు చేసి మైనార్టీల ప్రార్థనా స్థలాల మీద జరుగుతున్న దాడులను అరికట్టాలని వక్తలు డిమాండ్ చేశారు. నూతన విద్యావిధానం -2020 ద్వారా చేపడుతున్న కాషాయికరణ , కార్పొరేటీకరణను ఆపేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల కేసుల్లో దర్యాప్తు విచారణ వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం మానవ హక్కుల వేదిక రాష్ట్ర కమిటీలను ఎన్నుకున్నారు. ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులుగా అనంతకు చెందిన చంద్రశేఖర్‌తో పాటూ జీవన్ కుమార్, వసంతలక్ష్మి, కృష్ణ తదితరులున్నారు.

కారును ధ్వంసం చేసిన టీడీపీ మూకలు



ధ్వంసమైన స్కార్పియో వాహనం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని ఓబుళనాయనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గంగాధర్‌నాయుడుకు చెందిన కారు (స్కార్పియో)ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇంటి ఆవరణలో ఉంచిన స్కార్పియోను అర్ధరాత్రి సమయంలో రాళ్లతో ధ్వంసం చేశారని గంగాధర్‌నాయుడు తెలిపారు. గ్రామానికి చెందిన టీడీపీ మూకలే ఈ పని చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పోలీసులు విచారణ చేపట్టారు.

దొంగను పట్టించిన గ్రామస్తులు

లేపాక్షి: మండలంలోని పులమతి ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఉన్న హుండీలోని నగదును ఓ దొంగ ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించాడు. స్థానికుల వివరాలమేరకు... పులమతి గ్రామ సమీపంలో ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. ఆ విగ్రహం ముందు హుండీని కూడా ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఆంజనేయ విగ్రహం వద్ద పెద్ద శబ్ధం రావడంతో స్థానికులు ఆ పరిసరాలను గమనించారు. ఆంజనేయస్వామి విగ్రహం ముందున్న హుండీలోని కానుకలను తీసి లెక్కిస్తుండటాన్ని చూశారు. వెంటనే దొంగను పట్టుకొని హుండీలోని రూ.18 వేల నగదును స్వాధీనం చేసుకొని అతన్ని పోలీసులకు అప్పగించారు. దొంగ కర్ణాటకకు చెందిన హరీష్‌గా పోలీసుల విచారణలో తేలింది. మరిన్ని వివరాలు పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఘనంగా బాబయ్య స్వామి గంధం వేడుక



బాబయ్య స్వామి సమాధికి గంధాన్ని సమర్పిస్తున్న పీఠాధిపతి

పెనుకొండ: ప్రసిద్ధి గాంచిన పెనుకొండ బాబయ్య స్వామి గంధం వేడుకలు వైభవంగా జరిగాయి. డప్పు వాయిద్యాలు, ఫకీర్ల విన్యాసాల నడుమ శనివారం తెల్లవారుజాము 2 గంటలకు దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా గంధంను తలపై ఉంచుకుని ఇంటి బయలు దేరారు. తెల్లవారుజాము 5 గంటలకు బాబయ్య స్వామి సమాధి వద్దకు చేరుకుని గంధం సమర్పించారు. అనంతరం మత పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకుముందు జరిగిన సర్వమత సమ్మేళనంలో వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు. ప్రపంచ శాంతి కోసం అందరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. కాగా గంధం వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో పెనుకొండ కిటకిటలాడింది. ఉర్సు సందర్భంగా బాబయ్య స్వామి దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పట్టపగలే రెచ్చిపోతున్న దొంగలు



కొడిమి జగనన్న లేఔట్ నుంచి ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇనుపకడ్డీలు

- కొడిమి జగనన్న లేఔట్‌లో ఇళ్ల నిర్మాణ మెటీరియల్ ఎత్తుకెళ్తున్న వైనం
- ఇప్పటికే లక్షలాది రూపాయల సరుకు మాయం
- మెటీరియల్ తరలింపు వెనుక 'తమ్ముళ్ల' హస్తం

రాప్తాడురూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనంతపురం రూరల్ మండలం కొడిమి, ఆలమూరు జగనన్న కాలనీలపై కొందరు తమ్ముళ్లు కన్నేశారు. ఇంటి నిర్మాణాల కోసం ఉంచిన మెటీరియల్‌ను యథేచ్ఛగా ఎత్తుకెళ్తున్నారు. ప్రభుత్వ మెటీరియల్ తెలిసినా అధికారమే అండగా ట్రాక్టర్లు, లగేజీ వాహనాలు పెట్టి మరీ తరలించారు. ఆయా లేఔట్లలో ఇళ్ల నిర్మాణాల కోసం డంప్ చేసిన ఇసుక, సిమెంట్, ఐరన్, సిమెంట్ పెల్లలను విచ్చలవిడిగా తరలించారు. కొందరైతే గుజరీలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. అప్రమత్తమైన అధికారులు వాచ్‌మెన్లను ఏర్పాటు చేశారు. వీరుకూడా స్థానికంగా ఉన్న తెలుగుదేశం నాయకులు సూచించిన వారే కావడంతో వాచ్‌మెన్లు కూడా నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఎవరెవరు ఎత్తుకెళ్తున్నారో ఈ వాచ్‌మెన్లకు తెలుసని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు.

పట్టపగలే ట్రాక్టర్లలో తరలింపు..

ఇన్ని రోజులు రాత్రిపూట, తెల్లవారుజామున మెటీరియల్‌ను ఎత్తుకెళ్లిన దుండగులు... ఇప్పుడు పట్టపగలే బరి తెగిస్తున్నారు. కొడిమి జగనన్న లేఔట్ నుంచి ఇసుక, కడ్డీలు, సిమెంట్ పెల్లలు, సిమెంట్, చివరకు కార్మికులు పనిమీద వినియోగించుకునే ఇనుప కుర్చీలు, రేకులు (షీట్లు) ఎత్తుకెళ్తున్నారు. నరసనాయనికుంట, కొడిమి, రాచానపల్లికి చెందిన వారే ఎక్కువగా ఈ మెటీరియల్‌ను ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. కొందరు ఇళ్ల వద్ద, తోటల్లో డంప్ చేసుకున్నట్లు సమాచారం. మరికొందరు షెడ్ల నిర్మాణాలకు అవసరమైన మొత్తం మెటీరియల్ ఇక్కడి నుంచి తరలించారు. లేఔట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఓ తోటలో కొడిమికి చెందిన వ్యక్తి షెడ్డు నిర్మాణానికి ఇక్కడి నుంచి ఇసుక, పెల్లలు, కడ్డీలు తరలించినట్లు చెబుతున్నారు.

బలికానున్న హౌసింగ్ ఉద్యోగులు..

మెటీరియల్ పెద్ద ఎత్తున తరలిపోవడంతో హౌసింగ్ ఉద్యోగులు బలికానున్నారు. పనులు నిలబట్టే రోజుకు లేఔట్లలో ఏయే మెటీరియల్ ఎంతెంత ఉందో రికార్డు చేశారు. ఇదంతా సంబంధిత హౌసింగ్ ఏఈ ధ్రువకరించి సంతకం చేసి ఉంటారు. మెటీరియల్ వివరాలను ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేశారు. జగనన్న లేఔట్లలోని మెటీరియల్‌పై విజిలెన్స్ విచారణ సాగుతోంది. మరో 10-15 రోజుల్లో కొడిమి, ఆలమూరు లేఔట్లలోనూ ఈ విచారణ జరుగుతుంది. ఆన్‌లైన్‌లో ఉన్న స్టాక్, ఫిజికల్‌గా ఉన్న స్టాక్‌కు కచ్చితంగా వ్యత్యాసం వస్తుంది. అలా వస్తే తమ ఉద్యోగులు బలవుతారని హౌసింగ్ అధికారి ఒకరు వాపోయారు.

హౌసింగ్ ఏఈ రాజేష్ ఏమంటున్నారంటే....

కొడిమి జగనన్న లేఔట్ నుంచి మెటీరియల్ ఎత్తుకెళ్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. ట్రాక్టర్లలో తరలించినట్లు గుర్తించాం. స్టాక్‌లో తేడా వస్తే తాము ఇబ్బందులు పడతాం. తాటిచెర్ల లేఔట్ పనులు జరుగుతున్నాయి. రెండుమూడు రోజుల్లో టిప్పర్ల ద్వారా మెటీరియల్‌ను అక్కడికి తరలిస్తాం. ఇప్పటికే ఎత్తుకెళ్లిన మెటీరియల్‌పై పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తాం. నిందితుల నుంచి రికవరీ చేయించి కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటాం.

అమ్మ కోసం పోలీసులను ఆశ్రయించిన చిన్నారులు



అమ్మ కావాలి

- బిడ్డలను వదిలి మరో యువకుడితో ఉంటున్న తల్లి
- అమ్మకావాలంటూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన కూతుళ్లు

అమ్మ.. అనే రెండక్షరాల పదం అనురాగ చిహ్నం, ఆత్మీయతకు సంకేతం, భాషకు అందని భావం... అయితే ఓ మహిళ తీసుకున్న నిర్ణయం అమ్మతనానికి తలవంపులు తెచ్చింది. ఏకంగా కన్న బిడ్డలను రోడ్డుపై పడేలా చేసింది. నువ్వే కావాలమ్మా అంటూ ఆ బిడ్డలు పడుతున్న వేదనను చూసి అంతా కరిగిపోతున్నా ఆ తల్లి హృదయం మాత్రం కరగడం లేదు. – తాడిపత్రిటౌన్:

తాడిపత్రి పట్టణంలోని పోరాట కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మీనారాయణమ్మ, రంగనాయకుల దంపతులకు ముగ్గురు కుమార్తెలు మేఘన, మేఘన, సుష్మ (మొదటి ఇద్దరి పేర్లు మేఘనానే) ఉన్నారు. భార్యాభర్తలు వీధి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. అయితే ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో రంగనాయకులు మృతి చెందాడు. వీధి వ్యాపారంతో పాటు చిన్నపాటి కూలి పనులు చేసుకుంటూ లక్ష్మీనారాయణమ్మ బిడ్డలను చదివించేది. అయితే తాడిపత్రిలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడంతో అక్కడి పనులకు వెళ్లిన లక్ష్మీనారాయణమ్మ ఓ యువకుడి ప్రేమలో పడింది. దీంతో ఇద్దరూ పెళ్లి చేసుకొని వేరే కాపురం పెట్టారు. వారి జీవితానికి పిల్లలు అడ్డంకిగా మారడంతో వారిని వదిలి మరోచోట ఇల్లు అద్దెకు తీసుకొని పిల్లలను పట్టించుకోవడం మానేశారు. దాదాపు మూడు నెలలుగా పిల్లల బాగోగులను బంధువులు చూస్తూ వస్తున్నారు. పిల్లలు, బంధువులు ఎంత బతిమలాడినా లక్ష్మీనారాయణమ్మ రాకపోవడంతో పిల్లలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని 'సార్ .. అమ్మ కావాలంటూ' ప్రాధేయపడ్డారు. ఈ సమస్య ఎలా పరిష్కరించాలో అర్థంకాక పోలీసులు సందిగ్ధంలో ఉన్నారు.

క్లుప్తంగా

పోటీ పరీక్షల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీఐ హేమంత్ కుమార్

అనంతపురం: కానిస్టేబుల్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అండగా నిలుస్తామని ఇటుకలపల్లి సీఐ హేమంత్ కుమార్ తెలిపారు. శనివారం ఎస్కేయూ క్యాంపస్‌లోని స్టేడియంలో కానిస్టేబుల్, ఎస్‌ఐ పోటీపరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులను కలిశారు. వారాంతాల్లో నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షకు సంబంధించి మెలకువలు నేర్పించే దిశగా కృషి చేస్తామన్నారు. ఎలా చదవాలి? పరీక్షల్లో ఎలా నెగ్గాలి? తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఇటుకలపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి



మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

అనంతపురం రూరల్/అనంతపురం టవర్ క్లాక్: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాల్సిన భాద్యత అధికారులపై ఉందని మైనార్టీ వెల్ఫేర్ ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మైనార్టీ సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాయసుబ్బారెడ్డి అధ్యక్షతన మైనార్టీ వెల్ఫేర్, కార్పొరేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ.. ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలన్నారు. మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో నడుసున్న సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు, మైనార్టీ సంక్షేమశాఖ, కార్పొరేషన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తన దృషికి తీసుకురావాలన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తేనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ ఏడీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సంధ్యామూర్తికి సేవా తపస్వి పురస్కారం



సంధ్యామూర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: నాట్యాచార్యులు సంధ్యామూర్తి ఐదు దశాబ్దాల నిరుపమాన సేవలను గుర్తించిన ఏలూరుకు చెందిన అభినయ నృత్యభారతి సంస్థ వారు ×సేవా తసస్వి¥ పురస్కారం అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధులైన నాట్య కోవిదులను శనివారం రాత్రి ఏలూరులో ఘనంగా సత్కరించారు. భారత కళా ప్రపూర్ణ కోరాడ నరసింహారావు స్మారకంగా అందించే అవార్డును సంధ్యామూర్తి అందుకోవడంపై నిర్వాహకులు మనోహర్ లునాని, లయన్ యార్లగడ్డ జగన్మోహనరావు, నాట్యాచార్య హేమసుందర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. రాయలసీమలో అనంత ఆణిముత్యాలను నాట్యరంగంలో తీర్చిదిద్దడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ



శైలజ రెడ్డిని అభినందిస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత

అనంతపురం: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 52వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన–2024లో ఎస్కేయూ క్యాంపస్‌లో ఉన్న పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న శైలజ రెడ్డి ప్రతిభ కనబరిచింది. ఈ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో 64 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతపురం కేంద్రీయ విద్యాలయం తరపున ప్రాతినిథ్యం వహించిన శైలజ రెడ్డి.. వేస్ట్ మేనేజ్‌మెంట్, సోలార్ గ్యార్బాజ్ క్లీనర్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. బాల వైజ్ఞానిక ప్రదర్శనలో రెండో బహుమతి దక్కించుకుంది. శనివారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత విద్యార్థిని శైలజ రెడ్డిని అభినందించారు. భవిష్యత్తులో మరింత రాణించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

బావి స్థలం.. ప్రైవేట్ పరం

- కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు అడ్డేది?
- బావిలో అనధికార నిర్మాణం
- నగర మ్యాప్‌లో స్పష్టంగా కన్పిస్తున్న బావి స్థలం
- నిర్మాణాన్ని అడ్డుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- ఓ మాజీ కార్పొరేటర్ ఓవరాక్షన్



41వ డివిజన్ కైలాసం రోడ్డుకు సమీపంలో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకున్న నిర్మాణం ఇదే..



నగరపాలక సంస్థ లేఅవుట్ మ్యాప్‌లో బావి ఉన్నట్లు చూపుతున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రూ.లక్షలు విలువ చేసే ఓపెన్ స్థలాలకు దిక్కు లేకుండా పోతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇటువంటి పరిస్థితి ఏనాడు కన్పించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఒక్కొక్క చోట పాగా వేసేందుకు టీడీపీ చోటా నాయకులు పావులు కదుపుతున్నారు. అడ్డుకునేందుకు వెళ్లిన టౌన్ ప్లానింగ్ అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తుండటం చర్చనీయాంశమైంది.

6 సెంట్ల స్థలం కబ్జా..

నగరంలోని 41వ డివిజన్ 60వ సచివాలయం పరిధిలోని కైలాసం రోడ్డుకు సమీపంలో పాత బావి ఉంది. 2014–19 టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఓ కార్పొరేటర్‌కు ఈ స్థలంపై కన్నుపడింది. గుట్టుచప్పుడు కాకుండా స్థలాన్ని కబ్జా చేసేశారు. చివరకు ఆ స్థలాన్ని స్థానికంగా ఉండే ఓ వ్యక్తి (ఆర్ట్స్ కళాశాలలో పని చేసే ఉద్యోగి)కి విక్రయించినట్లు సమాచారం. ఇటీవల సదరు వ్యక్తి ఆరు సెంట్ల స్థలంలో నిర్మాణం చేపడుతున్నాడు. అనధికారికంగా చేపడుతున్న నిర్మాణాన్ని పరిశీలించేందుకు ప్లానింగ్ కార్యదర్శి అక్కడకు వెళ్లగా అసలు బాగోతం వెలుగు చూసింది. వాస్తవంగా నగర మ్యాప్‌లో ఆ స్థలంలో బావి ఉన్నట్లు ఉంది. దీంతో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు అవాక్కయ్యారు. కొన్నేళ్లుగా నగరపాలక సంస్థకు చెందిన స్థలాన్ని గుర్తించకపోవడమేంటని ఆరా తీశారు. దీంతో ఉన్నఫళంగా అనధికార నిర్మాణానికి అడ్డువేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు అక్కడికి వెళ్లారు. తక్షణం అనధికారిక నిర్మాణాన్ని ఆపేయాలని తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఓ మాజీ కార్పొరేటర్ వీరంగం చేశారు. పేద వారు కట్టుకుంటుంటే ఆ స్థలాన్ని బావి స్థలం ఏవిధంగా అంటారని నానా యాగీ చేసింది. చివరకు నగరపాలక సంస్థకు సంబంధం లేదని తేల్చి ఓవరాక్షన్ చేశారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రస్తుతానికి ఆ స్థలంలో నిర్మాణం చేపట్టవద్దని.. అనధికార నిర్మాణం చేపడుతున్న వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి నిర్మాణాన్ని ఆపేయాలని ఆదేశించారు. సర్వేయర్ వచ్చాక, రికార్డులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాస్తవంగా ప్రస్తుతం నగరంలో ఆ స్థలం విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుంది.

మ్యాప్‌లో బావి చూపిస్తుంది



41వ డివిజన్ పరిధిలోని కైలాసం రోడ్డు వద్ద అనధికార నిర్మాణం జరుగుతున్నట్లు సమాచారం వచ్చింది. ఆ నిర్మాణాన్ని ఆపేలా చర్యలు తీసుకున్నాం. నగరపాలక సంస్థకు చెందిన అప్రూవ్‌డ్ లే అవుట్ మ్యాప్‌లో ఆ స్థలంలో బావి ఉన్నట్లు గుర్తించాం. నిర్మాణదారుడికి డాక్యుమెంట్లు తీసుకురావాలని చెబితే ఇంత వరకు ఆ ఊసే లేదు. నిబంధనలకు లోబడి ముందుకెళ్తాం.

– శ్రీనివాసులు, ఏసీపీ

ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికలు

రాప్తాడు: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాతంగా జరిగాయని తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రెండు భారీ, నాలుగు చిన్న నీటి పారుదల చెరువుల సాగు నీటి సంఘం ఎన్నికలు జరిగాయి. సాగు నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యుల ఎన్నికల్లో భాగంగా పోటీల్లో ఎవరూ లేకపోవడంతో ఎన్నికలు మండలా వ్యాప్తంగా ఏకగ్రీవంగా జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాప్తాడు సాగునీటి సంఘం అధ్యక్షురాలిగా సాకే తిరుపాలమ్మ, ఉపాధ్యక్షుడిగా అగ్ర యరగుంటప్ప, బుక్కచెర్ల సాగునీటి సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పుల్లన్న, చాపట్ల సాగునీటి సంఘం అధ్యక్షుడిగా విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా రాముడు, ఎం.చెర్లోపల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఉమాపతి, ఉపాధ్యక్షురాలిగా రాజ్యలక్ష్మి, పాలచెర్ల సాగునీటి సంఘం అధ్యక్షుడిగా లక్ష్మన్న, ఉపాధ్యక్షుడిగా అక్కులప్ప, గాండ్లపర్తి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా జయచంద్ర, ఉపాధ్యక్షుడిగా పోతులయ్యని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఎన్నికల అధికారులు డిక్లరేషన్ పత్రాలను ఆయా పోలింగ్ స్టేషన్లలో అందజేశారు. మండలంలో ఎక్కడా ఎలాంటి ఘర్షణలు జరగకుండా సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

ఏకగ్రీవం..

ఆత్మకూరు: మండలంలో బి.యాలేరు, మదిగుబ్బ గ్రామాల్లో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. బి.యాలేరు సాగునీటి సంఘం చైర్మన్‌గా ముసలన్న, వైస్ చైర్మన్‌గా సాలప్ప, నలుగురు డైరెక్టర్లను ఎంపిక చేశారు. మదిగుబ్బ సాగునీటి సంఘం చైర్మన్‌గా రంగప్ప, వైస్ చైర్మన్‌గా నాగభూషణంతో పాటు నలుగురు డైరెక్టర్లను నియమించారు. వీరితో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఇరిగేషన్ అధికారి విజయ్ ప్రమాణం చేయించారు.

రూరల్‌లో రెండూ ఏకగ్రీవమే..

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండల పరిధిలోని కందుకూరు, ఆలమూరు రెండు సాగునీటి సంఘాలూ ఏకగ్రీవమయ్యాయి. కందుకూరు సంఘం అధ్యక్షుడిగా ఎం.పోతలయ్య, ఉపాధ్యక్షుడిగా రాగే బాలాజీ, టీసీలుగా పోతూరు రామచంద్రారెడ్డి, తలారి వెంకటరాముడు, ఎస్.అనసూయమ్మ, బి.వీరప్ప ఎన్నికయ్యారు. అన్ని పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. ఎన్నికల అధికారిగా రూరల్ తహసీల్దార్ మోహన్ కుమార్ వ్యవహరించారు.

ఆలమూరు సంఘం అధ్యక్షుడిగా ఎస్.కృష్ణయ్య

ఆలమూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఎస్.కృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా బి.నాగశేషారెడ్డి, టీసీలుగా కుంచం రామకృష్ణారెడ్డి, బి.లక్ష్మీనారాయణరెడ్డి, బి.కోనారెడ్డి, జెన్నే గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇక్కడ ఎన్నికల అధికారులుగా ఎంపీడీఓ పి.దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు వ్యవహరించారు. నూతన కార్యవర్గాలను ఎన్నికల అధికారులతో పాటు అనంతపురం రూరల్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మేకల వేణుగోపాల్, టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ తదితరులు అభినందించారు.

త్రిమూర్తి స్వరూపుడు.. దత్తాత్రేయుడు

- నేడు సత్యదత్త వ్రతాలు, దత్తహోమాలు
- ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి



ఉమానగర్‌లో వెలసిన పురాతన దత్తాత్రేయ దేవస్థానం



పాతూరులో కొలువుదీరిన దత్తాత్రేయుడు

అనంతపురం కల్చరల్: అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి.. జగతిని సన్మార్గంలో నడిపించిన అవధూత స్వరూపం దత్తాత్రేయుడి జయంతి వేడుకలు రెండు రోజుల పాటూ ఘనంగా జరుగనున్నాయి. త్రిమూర్తులు ఏకమై ఒక రూపమై భక్తులకు ఆనందాన్ని కలగజేస్తున్న దత్త మందిరం అనంతలో దాదాపు రెండు వందలేళ్ల కిందట రూపుదిద్దుకుంది. జిల్లాలోనే అతి ప్రాచీనమైన దత్తమందిరాల్లో ఒకటైన పాతూరు ఉమానగర్‌లో 1,826 మాఘశుద్ధ పౌర్ణమి నాడు ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. ప్రయివేటు వ్యక్తుల చేతుల నుంచి ఎండోమెంట్‌కు మారి ఐదేళ్ల కిందట శృంగేరీ శారదా పీఠం ఆధ్వర్యంలో నడుస్తోంది. ఇదే ఆలయంలో ఔదంబర వృక్షం, గణపతి, హరిహరనాథుడు, మహాశివుడు, గాయత్రీ మాత, పర్వతవర్ధిని, నవగ్రహాలు శతాబ్దాలుగా నిత్యపూజలందుకుంటున్నాయి. శనివారం దత్త వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. నిర్వాహకుడు అప్పా సుధీర్ మాట్లాడుతూ.. ఆదివారం సత్యదత్త వ్రతాలు, దత్తహోమాలు, భిక్ష, చవలం బంతి, ప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి..

ఈసారి దత్తాత్రేయ జయంతిని పలు చోట్ల కనుల పండువగా నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులతో అభిషేకాలు, నగరోత్సవాలు భక్తిభావం నింపేలా సాగుతున్నాయి. హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమంలో అవధూత దత్త స్వరూపులైన శ్రీపాద వల్లభులు, నరసింహ సరస్వతి, షిర్డీ సాయిబాబా, అక్కల్ కోట మహారాజ్, మాణిక్ ప్రభు తదితరులు కొలువై దత్తజయంతి నాడు ప్రత్యేక పూజలు అందుకుంటారని ఆశ్రమ నిర్వాహకుడు విజయ్ కుమార్ తెలిపారు. అలాగే సాక్షాత్తు గణపతి సచ్చిదానంద స్వామి వారి నిత్య పర్యవేక్షణలో సాగిన స్థానిక జెడ్పీ ఎదురుగా ఉన్న గణపతి సచ్చిదానంద దత్తమందిరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అలాగే నగరంలోని షిర్డీ సాయిబాబా మందిరాల్లో దత్తజయంతి ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్థానిక తపోవనం సమీపంలోని ప్రశాంతి నగర్‌లో దత్తవ్రతాలు జరగనున్నాయి.

వేడుకలకు తరలిరండి..

నగర శివారులోని భ్రమరాంబ కాలనీలో వెలసిన జగద్గురు శంక దత్తాత్రేయ మహా సంస్థానం శృంగేరి విరూపాక్ష మఠంలో జరిగే దత్త జయంతికి భక్తులు తరలిరావాలని మఠాధిపతి నరసింహ సరస్వతీ తెలిపారు. మఠంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులకు భోజన వసతి కూడా కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

కుష్టుపై ఆందోళన అవసరం లేదు



పుండ్లు కాకుండా ఎలా శుభ్రం చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ గంగాధర్ రెడ్డి

కూడేరు: కుష్టు వ్యాధి పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా లెప్రసీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ గంగాధర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కుష్టు రోగుల కాలనీలో అంగవైకల్యం నివారణ–వైద్య పునరావాస శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స పొందితే పూర్తిగా నయం చేయొచ్చని మెడికల్ ఆఫీసర్ గంగాధర్ రెడ్డి తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తులను భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో పారా మెడికల్ ఆఫీసర్ నాగన్న, డీపీఎంఓలు సత్యనారాయణ, తిప్పేస్వామి ,సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్ఎం భాను, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని యర్రంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. చివరి రోజైన శనివారం దేవాలయంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్ఠించారు. అనంతరం విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



అలంకరణలో ఆంజనేయుడు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వజ్రకరూరు: మండలంలోని పీసీ చిన్నప్యాపిలికి చెందిన బొబ్బిలి హనుమంతరెడ్డి (58) విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. వివరాలు.. పీసీ చిన్న ప్యాపిలికి చెందిన హనుమంతరెడ్డి ఏడు ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నాడు. హనుమంతరెడ్డి అప్పుడప్పుడు మిద్దెపైన నిద్రించేవాడు. శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత మిద్దెపైకి వెళ్లి నిద్రించాడు. ఉదయం 9 గంటలు దాటినా నిద్రలేవకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూశారు. అప్పటికే విద్యుదాఘాతానికి గురైనట్లు గుర్తించారు. వెంటనే అతన్ని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి, అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొంది. ప్రమాదంలో పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన యోగా, సురేష్, జ్ఞానేశ్వర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆటోను తప్పించబోయి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ప్రమాదం సంభవించింది. యోగా అనే యువకుడిని వైద్యుల సలహా మేరకు అనంతపురం రెఫర్ చేశారు. సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

హంద్రీనీవా కాలువలో గుర్తు తెలియని శవం

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు సమీపంలోని హంద్రీనీవా ఎత్తిపోతల పథకం వద్ద శనివారం రాత్రి గుర్తు తెలియని శవం కొట్టుకొచ్చింది. శవాన్ని గుర్తుంచిన అక్కడ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు 40 ఏళ్లు ఉంటుందని, రాత్రి వేళ కావడంతో ఆదివారం శవాన్ని వెలికితీయిస్తామని ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు.

నేడు ప్రీ క్రిస్మస్ వేడుకలు

అనంతపురం కల్చరల్: స్థానిక అరవింద నగర్‌లోని జీసెస్ కంపాషన్ చర్చిలో ఆదివారం ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు మందిరం అధ్యక్షుడు రెవరెండ్ మోజెస్ అనిల్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నారుల ఆటపాటలు, వాక్యోపదేశం, భక్తి గీతాలపనలతో పాటూ ప్రభు సంస్కార భోజనం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాప్తాడు: మండలంలోని హంపాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శివ ప్రసాద్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాప్తాడు, రామినేపల్లి, హంపాపురం, గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు, అయ్యవారిపల్లి, గంగలకుంట గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

డీఎం కార్యాలయాన్ని మార్చాలి

అనంతపురం క్రైం: శిథిలావస్థకు చేరిన అనంతపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయాన్ని మార్చాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యాలయం పూర్తి అధ్వానంగా తయారైందన్నారు. తక్షణం కార్యాలయాన్ని మార్చకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. చాలా ఏళ్ల క్రితం భవనం నిర్మించడంతో కూలిపోయే స్థితిలో ఉందని గుర్తు చేశారు. ఈ కార్యాలయంలో సిబ్బంది భయం.. భయంగా పని చేయాల్సి వస్తోందన్నారు. చైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అనంతపురం జిల్లా చైర్మన్ సూరిబాబు, డిపో కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్, క్రాఫ్ట్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా మండలి ద్వారా సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే కంప్యూటర్, క్రాఫ్ట్ కోర్సులకు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్లు ఓబిరెడ్డి, గజలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. శిక్షణ పూర్తయిన విద్యార్థులకు 2025 మార్చి, ఏప్రిల్‌లో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఈ సర్టిఫికెట్ ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్–2, 3, 4 నాన్‌ఎగ్జిక్యూటివ్ పోస్టులు, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ డేటా ప్రాసెసింగ్‌తో పాటు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు ఉపయోగపడుతుందన్నారు.

మైనారిటీల ఆత్మీయ సమావేశం

అనంతపురం సిటీ: రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సలహాదారుడిగా అల్ హాజ్ ఎంఏ షరీఫ్‌ను నియమించడంతో శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ క్యాంపస్‌లోని డీపీఆర్సీ భవన్‌లో మైనారిటీల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. మైనారిటీ సంఘాలు, క్రిస్టియన్ మైనారిటీ, ప్రభుత్వ ఖాజీల సంఘం ఆధ్వర్యంలో ఎంఏ షరీఫ్‌కు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. మైనార్టీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని షరీఫ్ తెలిపారు.

బాల సదన్‌లో దుస్తుల పంపిణీ

అనంతపురం సెంట్రల్: ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో బాల సదన్‌లో ఉన్న విద్యార్థులకు ఆ సొసైటీ కార్యదర్శి శివ భార్య వైష్ణవి జన్మదినాన్ని పురస్కరించుకుని దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ, ఎస్ఎస్‌బీఎన్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్ నారాయణ, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ శివ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారులు



పొలాలపై కమ్ముకున్న మంచు

కమ్ముకున్న పొగ మంచు

చెన్నేకొత్తపల్లిని శనివారం ఉదయం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం 8 గంటలైనా మంచు వీడలేదు. నిత్యం రద్దీగా ఉండే 44వ నంబర్ జాతీయ రహదారిపై వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసుకుని, ప్రయాణం సాగించారు. చలి తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు బయటకు రాలేదు. – చెన్నేకొత్తపల్లి: